విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 15 డిసెంబరు 2025 8 పేజీలు

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలి

- పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలి

ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి

వార్త మెయిన్‌లో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను..

ప్రభుత్వం విరమించుకోవాలి

- 18న సిపిఐ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ వద్ద నిరసన
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు

విశాలాంధ్ర - చిత్తూరు: భారత కమ్యూనిస్ట్ పార్టీ చిత్తూరు జిల్లా సమితి సభ్యులకు ప్రజా సంఘలా నాయకులకు సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా పి పి పి విధానంలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 18 న మెడికల్ కాలేజీల వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించింది.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం వల్ల సామాన్య ప్రజలకు నిరుపేదలకు వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉన్నదని వాపోయారు.రాష్ట్రంలో 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలను పి పి విధానంలో ప్రైవేటీకరణ చేయడానికి జీవో నెంబర్ 590 ని జారీ చేయడం ఆందోళనకు గురి చేస్తున్నట్టు చెప్పారు.ఈ విధానం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని కాకుండా ఆ విద్యకు అనుబంధమైన ప్రభుత్వ ఆసుపత్రులో చికిత్స పొందే పేద ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యే ప్రమాదం ఉందని విమర్శించారు. మెడికల్ కాలేజీల పి పి పి విధానాల వల్ల

2 లో

సత్యవేడు తహసిల్దార్ కార్యాలయానికి...

సిబ్బంది కావలెను

పనుల ఒత్తిడి పెరగడంతో అష్టదిగ్బంధంలో తహసిల్దార్

విశాలాంధ్ర– సత్యవేడు: సత్యవేడు మండల తహసిల్దార్ రాజశేఖర్పై పనుల ఒత్తిడి అధికం కావడంతో కుర్చీలో కూర్చోవడానికి కూడా వీలు లేకుండా పరుగులు పెట్టే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా ప్రస్తుతం తహసిల్దార్ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వెంటాడడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్టు సమాచారం.ఒకపక్క సులూరుపేట ఆర్డిఓ కార్యాలయానికి,మరోపక్క శ్రీసిటీ పరిధిలోని రైతులు సంబంధించి కొనసాగుతున్న పలు కేసుల్లో కోర్టుకు పరుగులు తీయడం,ఇంకొకపక్క భూసేకరణ పనులు చూడడం వంటివి స్వయంగా చూసే పరిస్థితి ఏర్పడడం వల్ల తహసిల్దార్ రాజశేఖర్ అష్టదిగ్బంధంలో చిక్కుకున్నారేమో అని అనిపించక తప్పదు.ప్రధానంగా తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత నెలకొనడంతో ఈ పరిస్థితి దాపురించాయి.ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను, ప్రజల నుంచి వస్తున్న వినతలు పరిష్కారంలో జాప్యం అనివార్యంఅవుతోంది.పైగా వారంలో రెండు మూడు రోజులు వివిధ పనుల నిమిత్తం ఆర్డీవో కిరణ్మయి నుంచి పిలుపు రావడంతో తహసిల్దార్ రాజశేఖర్ సులూరుపేట కార్యాలయం పరుగు తీయడం,కేసుల నిమిత్తం విజయవాడకు వెళ్లి అక్కడ కూడా రెండు రోజులు మకాం వేసే పరిస్థితి రావడంతో పాటు ప్రస్తుతం భూసేకరణ పనులను వేగవంతం చేయడం వంటివి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.అయితే ఇందుకు తగ్గట్టు ప్రస్తుతం తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో అన్ని పనులు కూడా తహసిల్దార్ రాజశేఖర్ చూడాల్సిన పరిస్థితి దాపురించాయి.పైగా వానెల్లూరు భూఅక్రమ వెబ్లాండ్ నమోదు కేసులో ఇంచార్జ్ ఆర్ఐతో సహా వీఆర్వో,సర్వేయర్,డేటాఎంట్రీ ఆపరేటర్లను సస్పెండ్ చేశారు.అయితే వీరి స్థానంలో ఇప్పటివరకు కొత్తవారిని నియమించిన దాఖలాలు లేవు.దీంతోపాటు ప్రస్తుతం ఈ కార్యాలయంలో 15 మంది వీఆర్వోలకు గాను ఏడు మంది మాత్రమే పనిచేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఒక్కో వీఆర్వోకు రెండు మూడు పంచాయతీలు ఇంచార్జ్ చూసే పరిస్థితి ఏర్పడింది.ఇక్కడ రెగ్యులర్ ఆర్ఐగా పనిచేయాల్సిన నరేంద్ర డిప్యుటేషన్పై కెవిబి పురంలో పనిచేస్తున్నారు.

2లో

ప్రభుత్వ పాఠశాలల్లో...

నైతిక విలువల గురించి బోధించండి

- విద్యార్థులు సంఘంలో ఏ విధంగా జీవించాలి, నలుగురిలో ఎలా మాట్లాడాలి అనే విషయాలను ఉపాధ్యాయులు తెలియపరచాలి
- క్రమశిక్షణ లేనిదే చదువు అబ్బదనే విషయాన్ని తెలుసుకోవాలి

విశాలాంధ్ర–ఖైరెడ్డిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రాథమికంగా ఇప్పుడున్న పరిస్థితులలో నేర్పవలసినది నైతిక విలువలు అని తెలుస్తున్నది. బోధించవలసిన పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులకు సంఘంలో ఏ విధంగా జీవించాలనే విషయాలను, నలుగురిలో ఎలా మాట్లాడాలి అనే విషయాలను, ఏ విధంగా నడుచుకుంటే ఉత్తమ పౌరుడిగా తయారవుతాడు అనే విషయాలపై ఉపాధ్యాయులు ఇప్పుడు ఉన్నటువంటి విపత్కర పరిస్థితులలో శ్రద్ధ ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, విద్యార్థుల తల్లిదండ్రులకే అనిపిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధన పట్ల ఎంతో పట్టున్నవారే అయితే నైతిక విలువల గురించి బోధించేటప్పుడు వారి తల్లిదండ్రుల నుండి ఎదుర్కోవాల్సిన

2 లో

విలువల గురించి బోధించండి

(మొదటి పేజీ తరువాయి) ఇబ్బందులను వారు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు కాబట్టి ఇది అందరికీ సొంతం కాబట్టి, ఏ తప్పు చేసినా గాని మందలించే హక్కు ఉపాధ్యాయుడికి లేనట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రవర్తన ఉండడం వలననే నైతిక విలువలను బోధించలేక పోతున్నామని ఉపాధ్యాయులు బాహాటంగానే తెలియజేస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో మూడవ తరగతి నుండే పిల్లలు బూతులు మాట్లాడడం, అసాంఘిక విషయాల గురించి చర్చించుకోవడం, పెద్దలంటే గౌరవం లేకపోవడం, చదువు చదివినా, చదవకపోయినా తెంపరితన నంగా తయారవ్వడం, విద్యాబుద్ధులు నేర్పే గురువుల పైన చిన్న చూపు కలిగి ఉండడం, ఇవన్నీ ఒకింత విద్యార్థి యొక్క పతనానికి దారితీస్తాయని ఆలోచన లేకుండా ఇటువంటి విద్యార్థులకు కూడా వారి తల్లిదండ్రులు వెనకేసుకొస్తున్నారని ఉపాధ్యా యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమాజంలో చదువుతోపాటు ఆటపాటలు నైతిక విలువలు కలిగిన పెద్దబాలశిక్ష, నీతి పద్యాలు, నీతి కథలను బోధించాలి. తప్పు చేసిన విద్యార్థిని ఉపాధ్యాయులు దండించేటప్పుడు ఆ దండన మరి మితిమీర కుండా ఉండాలి. ఉపాధ్యాయులు దండించినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు దాన్ని పెద్దమనసు చేసుకొని ఆహ్వానించాలి. అటువంటి సమయంలోనే ఉపాధ్యా యులు విద్యార్థులకు మంచి బోధన బోధించగలుగుతారు. తద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా తయారవుతారని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించాలి. ఇప్పటికీ ఒకప్పటికి విద్యాబోధనలో విస్తృతమైన మార్పులు వచ్చినవి, క్రమశిక్షణ లేనిదే చదువు అబ్బదనే విషయాన్ని ముందుగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మానసిక ఉల్లాసం కోసం వారి మనస్తత్వాన్ని మార్చ గలిగే ఆలోచనలతో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని కేస్ స్టడీ చేసి అన్ని విధాలుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఉండాలి. ఎన్ని అడ్డంకులు వచ్చినా చేసే వృత్తిని దైవంగా భావించి, మన వద్దకు వచ్చే విద్యార్థులను పిల్లలుగా భావించి, ప్రేమను పంచి, అవసరాలను తీర్చి, మంచి పౌరుడిగా తీర్చిదిద్దడంలో తమ వంతు శాయశక్తులా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

సిబ్బంది కావలెను

(మొదటి పేజీ తరువాయి) వేతనం ఇక్కడ తీసుకుంటూ సేవలు అక్కడ అందిస్తున్నారు. దీంతోపాటు ఎలక్షన్ డిటి పోస్ట్ కూడా భర్తీకి నోచుకోక ఖాళీగా ఉంది. జూనియర్ అసిస్టెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది .జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ కూడా ఖాళీగా ఉంది.నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాకపోవడంతో ప్రజా సమస్యల్లో భాగంగా రెవెన్యూ కు సంబంధించిన పలు సమస్యలు సకాలంలో పరిష్కారం కాని పరిస్థితి ఏర్పడుతోంది.ఈ క్రమంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్న సిబ్బంది కొరత వల్ల పనులు పూర్తి కావడంలో జాప్యం నెలకొంటుంది.పైగా పనుల ఒత్తిడి అష్టదిగ్బంధం కారణంగా తాసిల్దార్ రాజశేఖర్ కుర్చీలో కూర్చొని ప్రజా సమస్యలపై దృష్టి సారించే సమయం లేకుండా పోతోంది .ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి సత్యవేడు తహసిల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజా సమస్యలకు సంబంధించి తహసిల్దార్ రాజశేఖర్ పూర్తిస్థాయిలో సేవలు అందించేల చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం విరమించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వ భూములు, భవనాలు వసతులు కాలేజీల ఆసుపత్రులు దాదాపు 60 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరించి 590 జీవోను తక్షణమే ఉపసంహరించుకొని గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 107,108ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమితి సభ్యులకు ప్రొఫెసర్ కే రాజశేఖర్ భారతీయ సమాజం - మనువాదం మా సీజన్ మార్క్సిజం అంశంపై బోధించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కె. శివారెడ్డి, ప్రొఫెసర్ కె.వి. రమణ , చిత్తూరు జిల్లా నుండి సిపిఐ నాయకులు హాజరయ్యారు.

ప్రజాదారణకు చెంచయ్య నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన రంగినేని చెంచయ్య నాయుడు తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనవాహినిని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజల ప్రేమ, అభిమానము, ఆత్మీయత తన హృదయాన్ని ఉప్పొంగేలా చేసిందని పేర్కొంటూ, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వకంగా నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన జరిగిన తన ప్రమాణస్వీకార కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడటానికి ప్రధాన కారణం ప్రజల అపారమైన సహకారం, ఆదరణేనని తెలిపారు. తనపై మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని తెలిపారు. తనపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు, అలాగే నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి వర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు తండ్రికి తగ్గ తనయుడివలె నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనిస్తూ నియోజకవర్గ ప్రజల మన్ననలను పొందుతున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అడుగడుగునా తనకు అండగా నిలిచిన బొజ్జల కుటుంబానికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో, నాయకుల మార్గదర్శకత్వంతో, రెట్టింపు ఉత్సాహంతో ఇకముందు రైతులకు సేవ చేస్తానని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని, రైతుల కోసం నిలబడి పోరాడతానని రంగినేని చెంచయ్య నాయుడు గారు హామీ ఇచ్చారు. మీ నమ్మకమే నా బలం నా శక్తి అని అన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

మీ కోసం 1100 సేవలను వినియోగించుకోండి: కలెక్టర్

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్: జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ 'మీ కోసం' కాల్‌సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా లేదా ఫిర్యాదుల స్థితి తెలుసుకోవాలన్నా 1100కి కాల్ చేయవచ్చని తెలిపారు. కొత్త అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కలెక్టరేట్‌లో నేడు 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుపతి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్న ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలతో రావాలని సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్లిప్పులు తీసుకురావాలని, సమస్య పరిష్కారం అయిన తరువాత ఫోన్ ద్వారా మెసేజ్ అందుతుందని చెప్పారు. వాట్సాప్ ద్వారా నోటీసులు, ఎండార్స్మెంట్లు పంపిస్తున్నామని, రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా అందిస్తున్నామని వివరించారు. అర్జీలు పూరించే సమయంలో స్పష్టమైన వివరాలు ఇవ్వాలని, పునరావృత అర్జీలకు పాత రసీదులు తప్పనిసరి అని సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మానసవీణకు ప్రతిష్టాత్మక మానవ హక్కుల అవార్డు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లాలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన భారత గౌరవ సామాజిక సేవ అవార్డు' మానవ హక్కుల అవగాహన కార్యక్రమంలో విశేష సేవలు అందించినందుకు శ్రీకాళహస్తి వాసి అయినా ఉడమలపాటి మానసవీణ రాయల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాల్లో నిరంతరంగా సేవలు అందిస్తున్నందుకు గాను ఈ అవార్డును ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం మానసవీణ రాయల్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని అందుకోవడం తనకు ఎంతో గర్వకారణమని తెలిపారు. మానవ హక్కుల కోసం తాను చేసిన పోరాటాలకు ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న జాతీయ అధ్యక్షులు అన్సార్‌కి, రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మానవ హక్కుల పరిరక్షణ కోసం మరింత ఉత్సాహంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, మేధావులు మానసవీణ రాయల్‌ను అభినందించారు.

సూర్యనారాయణుడి అభయప్రదానం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ సూర్యనారాయణస్వామి వారు ఆదివారం బంగారు తిరుచ్చి పై తిరుమాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త నక్షత్రము సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సూర్యనారాయణ స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి పై కొలువుదీర్చారు. అనంతరం విశేషాలంకరణలో విరాజిల్లుతున్న స్వామివారు తిరుచ్చి పై కొలువుదీరి నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు అభయప్రదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఈవో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబు స్వామి, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సొంత నిధులతో వీధులకు మోక్షం

విశాలాంధ్ర -కోట: కోట మండలం తిన్నెలపూడి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధులలోని రోడ్లు దెబ్బతిని గుంటలు ఏర్పడి గ్రామస్తులకు ఇబ్బందిగా ఉండడంతో గూడూరు శాసనసభ్యుడు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకురాలు గండవరం సుష్మా రెడ్డి తన సొంత నిధులతో ఆదివారం వీదులకు మరమ్మత్తులు చేయించారు. టిప్పర్ల ద్వారా మట్టి,గ్రావెల్ తోలించి చదునుచేయించారు. దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు తొలగిపోవడంతో ఆనందం వ్యక్తం చేస్తూ సుష్మా రెడ్డికి అభినందనలు తెలిపారు.

బెల్ట్ షాప్ పై ఆకస్మిక దాడులు- ఒకరుఅరెస్టు, 15 బాటిళ్ళు స్వాధీనం

విశాలాంధ్ర - కార్వేటి నగరం: మండలంలో బెల్ట్ షాపులపై ఎస్సై తేజస్విని మెరుపు దాడులు ఆదివారంనిర్వహించారు. రహస్య సమాచారం మేరకు చింత మండి క్రాస్ వద్ద గత కొంతకాలంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని సమాచారం పై ఎస్సై స్థానిక సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 బాటల్ లు స్వాధీనం చేసుకొని పాల సముద్రంకు చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది రాజశేఖర్ ,యువరాజు, సుల్తాన్ పాల్గొన్నారు.

గూడూరు ను జిల్లా చేయాలి

- కంకణాల పెంచల్ నాయుడు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ను జిల్లా చేయాలని కంకణాల పెంచల్ నాయుడు పేర్కొన్నారు.గూడూరు పట్టణంలోనీ సంగం థియేటర్ కూడలివద్ద భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు.దీనితో ప్రజలు స్వచ్ఛందంగా సంఘీభావం తెలిపారు అన్నారు. ఈ సందర్భంగా కంకణాల పెంచల్ నాయుడు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం చేయడానికి గూడూరుకు అన్ని అర్హతలు ఉన్నాయని బ్రిటిష్ కాలంలోనే రెవిన్యూ డివిజన్ గా పేరు పొందిందని గుర్తు చేశారు. ప్రభుత్వం గూడూరు జిల్లా చేయాలని కోరారు .

ఖచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందే

- ఎస్సై హరిప్రసాద్

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ ను తొలగించే అధికారం పోలీసులకు ఉందని ఎస్సై హరిప్రసాద్ అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ద్విచక్ర వాహనదారులకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం హెల్మెట్ ఉత్తర్వులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ వాహన చోదకులతో మాట్లాడుతూ నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మోటార్ వాహన చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నది.ద్విచక్ర వాహన డ్రైవర్ తో పాటు పిలియన్ రైడర్ ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు, లేదంటే జరిమానా విధించి, లైసెన్స్ తొలగిస్తామన్నారు ముఖ్యంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దీని అమలును కఠినతరం చేస్తున్నారు, ముఖ్యంగా ప్రమాదాలు పెరగడం వల్ల దీనిని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది, మరియు 'నో హెల్మెట్ - నో పెట్రోల్/రైడ్' నిబంధనలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బృందం పాల్గొన్నారు.

వసంతమ్మకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళులు

విశాలాంధ్ర -పాకాల : పాకాల మండలం, దామలచెరువు పంచాయితీ, కొత్తపల్లి గ్రామానికి చెందిన వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్‌రెడ్డి తల్లి వసంతమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో పాకాల మండల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులు కపిలేశ్వర్ రెడ్డి, రహీం , ఇమ్రాన్,మనోహర్ రెడ్డి, రమేష్ రెడ్డి, షమీఉల్లా, గణపతి రెడ్డి, రామూర్తి రెడ్డి, అల్తాఫ్ తదితరులు వున్నారు.

అవకాశాలు అపారం సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలి

విశాలాంధ్ర-సత్యవేడు: మేము చదువుకునే రోజుల్లో ఇన్ని అవకాశాలు లేవు. ప్రస్తుతం కంప్యూటర్ విద్య, ఆన్లైన్ విద్య, చాట్ జిపిటి లాంటి టూల్స్, ప్రముఖుల ప్రసంగాలు అందు బాటులో వున్నాయి"వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాణించాలంటూ ప్రఖ్యాత టాక్ షో ప్రయోక్త, సాహితీ వేత్త కిరణ్ ప్రభ విద్యార్థులకు సూచించారు. శనివారం సాయంత్రం శ్రీసిటీ సమీపంలోని ఇరుగుళం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. విద్యార్థి జీవితానికి క్రమశిక్షణే పునాదని, అది వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని ఆయన ఉద్బో ధించారు. కష్టపడి చదవడం, లక్ష్యసాధనలో పట్టుదల, సమయపాలనతోనే విద్యలో రాణిం చవచ్చని సూచించారు.మత్తు పదార్థాలు, అసభ్య ప్రవర్తన, సమయ వృథా చేసే అలవాట్లను దూరం పెట్టి సృజనాత్మ కతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. మొబైల్ ఫోన్లను అతిగా వాడొద్దని, విద్యకు అవసరమైన అంశాల కోసమే దానిని వినియోగించాలని చెప్పారు. ప్రసంగం అనంతరం విద్యార్థులు కిరణ్ ప్రభతో ముచ్చటిస్తూ.. అమెరికా విద్యకు మన విద్య విధానానికి వ్యత్యాసం ఏమిటని ప్రశ్నించారు. అక్కడ పుస్తకాలు, పరీక్షలు తక్కువగా వుంటాయని, సృజనాత్మకతకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం మన విద్యావిధానంలోనూ ప్రమాణా లు బాగా పెరిగాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తు న్నాయని చెప్పారు. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాక్ అసెంబ్లీ, మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీకి జిల్లా స్థాయి లో ఎంపికైన ఓ ఇరుగుళం స్కూల్ విద్యార్థినిని ఆయన అభినందిం చారు.ఈ కార్యక్ర మాన్ని శ్రీసిటీ ఫౌండేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఫౌండేషన్ తరచుగా ఇలాంటి ప్రేరణాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.విద్య, క్రమశిక్షణ,విలువలపై దృష్టి పెట్టే ప్రసంగాలు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తోంది. సమాజానికి ఉపయోగపడే పౌరులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.కార్పొరేట్ సంస్థలకే పరిమితమైన కిరణ్ ప్రభ లాంటి పలువురు ప్రముఖ వ్యక్తుల ప్రసంగ అవకాశాలను తమ స్కూల్ విద్యార్థులకు కల్పించిన శ్రీసిటీ ఫౌండేషన్కు స్కూల్ ప్రదానాపాధ్యాయులు చినబాబు, ఇతర ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు

కోటి సంతకాల మహా ర్యాలీని
విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం నుంచి కోటి సంతకాల మహా ర్యాలీలో అంద రూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆదివారం పిలుపు ఇచ్చారు. చంద్ర బాబు ప్రభుత్వం దుర్మార్గంగా మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేసి పేదలకు అన్యాయం చేస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ చంద్రగిరి నియోజకవర్గంలో ఒక ఉద్యమంలా సంతకాలు సేకరణ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే సంతకాలు పూర్తి చేసిన ప్రతులను జిల్లా పార్టీ కార్యాలయంకు అందజేయడం జరిగిందని, ఈనెల15వ తేదీన తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంకు తరలించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం తిరుపతి పద్మావతీపురం నుంచి నిర్వహించే భారీ ర్యాలీలో భాగస్వాములు అయ్యేందుకు చంద్రగిరి నియోజక వర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త తరలిరావాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్య కర్తలు అందరూ ఉదయం 9గంటలకు తుమ్మలగుంటకు చేరుకుంటే అక్కడ నుంచి పద్మావతీపురంకు ర్యాలీగా బయలుదేరనున్నట్టు ఆయన వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరుపతి జిల్లా పార్టీకిర్యాలీగావస్తున్నందునచంద్రగిరినుంచిఅత్యధికంగాతరలిరావాలనిచెవిరెడ్డిమోహిత్‌రెడ్డివిజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ:- యువ నాయకుడు సత్యవేడు నియోజకవర్గ యువ నాయకులను మారుమూల గ్రామీణ ప్రాంతాల యువకులను ఐక్యపరుస్తూ కొత్త ఒరవడితో ముందుకు తీసుకు వెళుతున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సోషియల్ మీడియా జిల్లా అధ్యక్షుడు రాజన్న భక్తుడు,జగనన్న సైనికుడు,అందరివాడు,మంచి సేవాభావం,మనసున్న వ్యక్తి, పేదల మనిషి వేలూరు రాకేష్ జన్మదిన వేడుకలు ఆదివారం జరుపుకున్నారు. జన్మదినోత్స వం సందర్భంగా వ్యక్తిగతంగా కలసిన వారికి, ఫోన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదము లు.నా పై మీరు చూపించిన ప్రేమాభిమానాలకు మీకు సర్వదా కృతజ్ఞతుడనై సత్యవేడు నియోజకవర్గ ప్రజల సేవలో నిరంతరం ప్రజల కోసం పని చేసే వ్యక్తిగా ఉండటమే నా ధ్యేయం.

రేణిగుంటలో ఘనంగా అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - రేణిగుంట: రేణిగుంట మండల పరిధిలోని పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి లోని మరిగుంట కూడలి వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఉత్త రాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు. అటల్ సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పద్మలత, శరవణన్‌లకు ఘన సన్మానం

విశాలాంధ్ర పాకాల : కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు పద్మలత కనకరాజన్, రాష్ట్ర మొదలియార్ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ సభ్యులు శరవణన్ లను ఆదివారం పాకాల లో మొదిలియార్ సంఘం వారు ఘనంగా సన్మానించారు. స్థానిక పట్టణంలోని లీలామాలతికళ్యాణ మండపంలో పాకాల మండల మొదలియార్ సంఘం సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బోర్డు మెంబర్ శ్రీమతి పద్మలత కనకరాజన్ ను,రాష్ట్ర మొదలియార్ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.శరవణన్ లను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.మొదలియార్ సంఘం సంక్షేమం,అభివృద్ధి తోడ్పాటు కు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాకాల మండల మొదలియార్ సంఘం అధ్యక్షులు దేవ గురునాథన్ ,కార్యదర్శి నీలకంతం ,కోశాధికారి సంతోష్,సభ్యులు శివ కుమార్, సతీష్, చందమూరి, రూపేష్ ,ఉమామహేశ్వర న్ ,సాయిగురునాధన్ , రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఉంటేనే పెట్రోల్

విశాలాంధ్ర-డక్కిలి: హెల్మెట్ ఉంటేనే పెట్రోలు పట్టాలని పోలీస్ శాఖ పెట్రోల్ బంకు యాజమాన్యంకు ఆదేశాలు జారి చేసింది. ఈ నెల 15వ తేదీ నుండి గూడూరు డివిజన్ పరిధిలో నిబంధనలు కఠినంగా అమల్లోకి అంతే కాకుండా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాలు విధించడం కూడా జరుగుతుంది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలాని గూడూరు డీఎస్పీ గీతా కుమారి ఆదేశాలు జారిచేయడంతో పాటు మండల కేంద్రంలో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెల్మెట్ ప్రాధాన్యతను వివరించాలన్నారు.రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ మంది తలకు గాయపడటం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నా సంఘటన విదీతమే.హెల్మెట్ ధరించే సమయంలో స్ట్రాప్/క్లిప్ తప్పనిసరిగా వేయాలనే విషయాన్ని ప్రత్యేకంగా సూచించారు.ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు దుర్భర పరిస్థితులకు గురవుతున్నాయి, హెల్మెట్ వాడితే ఈ ప్రమాదాల వద్ద ప్రాణాలను రక్షించుకోవచ్చునన్నారు హెల్మెట్ ఒక బరువు కాదు :-హెల్మెట్ మీ బాద్యత, మీ కుటుంబం పెట్టుకున్న నమ్మకం, మీ ప్రాణాలను, మీ అమ్మా - నాన్నల ఆశల్నిమీ భార్య, పిల్లల భవిష్యత్తుని, మీ తల మీద పెట్టుకొని కాపాడుకుంటారాని గుర్తు చేశారు.మీ ప్రాణాలు క్షణిక నిర్లక్ష్యంతో వదిలేస్తారా ఒక్క సారి ద్విచక్ర వాహనం దారులు మీ మనసును అడిగి చూడండి. హెల్మెట్ లేదంటే, పెట్రోల్ లేదు ఈ నెల 15వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ పోయాలని పెట్రోల్ బంకు యాజమాన్యం అమలు చేస్తుంది.

బంగారుపాళెంలో పెరుగుతున్న చలి తీవ్రత

విశాలాంధ్ర-బంగారుపాళెం: చలితో వణికిపోతున్న స్థానికులు ఉదయం 8 గంటలైనా తగ్గని మంచు ప్రభావం బంగారుపాళెం పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా తెల్లవారుజామున మరియు ఉదయం వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఉదయం 7-8 గంటల సమయానికి చలి తగ్గుముఖం పట్టేది. కానీ, గత కొద్ది రోజులుగా ఉదయం 8 గంటలు దాటినా చలి తీవ్రత అలాగే కొనసాగుతోంది. దట్టమైన పొగమంచు, చల్లటి గాలుల కారణంగా ఉదయం పూట పనులు చేసుకునేవారు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మరియు వృద్ధులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.స్థానికులు చలి నుంచి రక్షణ కోసం స్వెటర్లు, మఫ్లర్లు ధరించడం, అలాగే పలు చోట్ల చలిమంటలు వేయడం కనిపిస్తోంది

తూర్పు వీధి భజన మందిరం నుంచి బంగారమ్మ ఆలయం వరకు పట్టువస్త్రాలు సమర్పణ

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం తూర్పు భజన మందిరం ఆలయము నుండి శ్రీ బంగా రమ్మ ఆలయం వరకు కార్వేటి నగరం ఆర్కే ఎస్ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బంగారమ్మ ఆలయం వరకు ర్యాలీగా అమ్మవారికి పట్టు వస్త్రాలు, కుంకుమ పసుపు,, గాజులు పూలమాలలు సమర్పించారు. పూర్వ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి సమర్పించడం విశేషం. మహిళలు కూడా సాంప్రదాయ దుస్తులతో రావడం విశేషమని చెప్పవచ్చు. దారి పడవన బాణ సంచాలు పేలిస్తూ కోలాటాలు వేస్తూర్యాలీగా వెళ్లారు. బంగారమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి ఆలయ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు ఎం కృష్ణస్వామి రాజు, ఎంపీపీ లతా బాలాజీ, సర్పంచ్ ధనంజయ వర్మ, ద్రౌపతి దేవి ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్, సుబ్రమణ్య స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు రాజశేఖర్, సదాశివేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు, పూర్వ విద్యార్థులు చంద్రారెడ్డి, హేమాద్రి, నాగరాజు, రాజేష్, శశిధర్ రెడ్డి, మహిళలు జయప్రద, కుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ కంచర్ల

విశాలాంధ్ర-రామకుప్పం: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ బాలుర హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎల్సీ మరియు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ఈ సందర్భంగా ఆదివారం హాస్టల్ లో విధ్యార్థుల వసతి గృహాలను మరియు మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరస్తున్న భోజన వసతిపై విధ్యార్ధులకు అడిగి తెలుసుకుని హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ మండలాధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భార్గవి చిన్నికృష్ణ, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చలపతి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ సీతాపతి, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్ రఫీ, మండల మైనారిటీ అధ్యక్షుడు ఆదిల్ బాషా, ఐటీడిపి మండల అధ్యక్షుడు

సురేష్, చాంద్ బాషా, మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, నిసార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-చిట్టమూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని చిట్టమూరు మండల ఎస్సై చిన్న బలరామయ్య హెచ్చరించారు. మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదు మంది పై కోర్టు రూ.56 వేలు జరిమానా విధించిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుండడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టామన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు ఎస్సై బలరామయ్య విజ్ఞప్తి చేశారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు.

వేషాలతో యువత

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ జాతరను పురస్కరించుకొని ఆదివారం యువత వేషాలు నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగుతూ చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వి.లక్ష్మయ్య, వినోద్, రామ్మూర్తి, శివ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించిన ఎస్సై

విశాలాంధ్ర-పిచ్చాటూరు: తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ యల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు పిచ్చాటూరు ఎస్ఐ బి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించి ర్యాలీగా బయలుదేరి ప్రజలకు అవగాహన కల్పించారు. పిచ్చాటూరు లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వైయస్ విగ్రహం కూడలి నుండి హెల్మెట్ ధరించి ద్వి చక్ర వాహనంపై పోలీసుల బృందంతో కలిసి బైపాస్ నుండి టౌన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ యువకులు, ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసుల బృందం, వాహనదారులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: ఇకపై హెల్మెట్ లేని ప్రయాణం, మద్యం తాగి వాహనం నడపడం.. నేరం.. ఆలోచించండి మీ ప్రాణం కోసం రేపటి నుంచే మొదలు ఒక్కసారి ఆలోచించండి మిత్రులారా హెల్మెట్ ఒక బరువు కాదు అది మీ మీద మీ కుటుంబం పెట్టుకున్న బాధ్యత. మీ ప్రాణాలనుమీ అమ్మా - నాన్నల ఆశల్ని మీ భార్య, పిల్లల భవిష్యత్తుని మీ తల మీద పెట్టుకొని కాపాడుకుంటారా లేదా క్షణిక నిర్లక్ష్యంతో వదిలేస్తారా ఒక్కసారి మీ మనసును అడిగిచూడండి. ప్రమాదంవచ్చినతర్వాతఅప్పుడు హెల్మెట్ పెట్టుంటే బాగుండేది"అని అనుకునే అవకాశం ఎవరికీ రాకూడదన్నదే మా లక్ష్యం. హెల్మెట్ లేదంటే - పెట్రోల్ లేదు15వ తేదీ నుంచి తిరుపతి జిల్లావ్యాప్తంగా అమలుఇది శిక్ష కాదుఇది మీ ప్రాణాల కోసం తీసుకున్న నిర్ణయం.మీ ప్రాణం విలువైనది. మీ కుటుంబానికి మీరు అవసరం. హెల్మెట్ ధరించండి బాధ్యతగా రైడ్ చేయండి జీవితాన్ని కాపాడుకోండి.

గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే మురళి మోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు మండలం గొడుగుచింత పంచాయతీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. జల్ జీవన్ మిషన కింద రూ.17.77 లక్షల వ్యయంతో నిర్మించిన 30 కిలోలీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ యస్ఆర్ ట్యాంకును గౌరవనీయులు పూతలపట్టు శాసనసభ్యులు డా. కలికిరి మురళీ మోహన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గంగవరపు గోపి, పూతలపట్టు ఎక్స్ జెడ్పిటిసి బాబురావు, పూతలపట్టు సింగల్ విండో అధ్యక్షులు జగన్నాథం, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ కథ కంచికేనా?

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి పట్టణ రహదారి విస్తరణ పనులు కంచికేనా అంటూ స్థానిక ప్రజల్లో చర్చనీయాంశమైంది. గల్లా అరుణకుమారి మంత్రిగా ఉన్న సమయంలో రహదారి విస్తరణ పనులకు చర్యలు చేపట్టినప్పటికీ వ్యాపారుల ఒత్తిడితో అప్పుడు ఆమె విస్తరణ పనులు కు సాహసించలేక పోయారు. స్థానికులందరినీ ఒకచోట చేర్చి ప్రజాభిప్రాయ సేకరణ నెపంతో ఆ రోజుల్లో ఆమె రహదారి విస్తరణ పనుల కథను కంచికి చేర్చింది. తర్వాత శాసనసభ్యుడిగా వచ్చిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నా కథ చూడండి అంటూ విస్తరణ పనులు చేపట్టి తీరుతాం అన్న ధ్యేయంతో ఆ ప్రణాళికను కొద్ది దూరం వరకు లాకెల్లి మార్కింగ్ కూడా ఇవ్వటం జరిగింది. కానీ స్థానిక నాయకుల ఒత్తిడితోనే ఆ పనులను నిర్వహించలేక పోయారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత శాసనసభ్యులు పులివర్తి నాని నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అంటూ చంద్రగిరి చిరకాల వాంఛ అయిన గోవిందధామం పనులకు శ్రీకారం చుట్టుటమే కాకుండా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలలో దూసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే రహదారుల పనుల విస్తరణ కార్యక్రమం తన దృష్టిలో ఉన్నప్పటికీ గోవింద ధామం రహదారి విస్తరణ పనులకు స్థానిక నాయకులతో ఓ కమిటీని వేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ల్యాండ్ ఆక్విజేషన్ రహదారికి ఇరువైపులా ఎన్ని అడుగుల మేర తీసుకోవాలి అన్న విషయంలో సందిగ్ధం ఒకటి కాగా వాటికి సంబంధించి పరిహారం చెల్లించటానికి నిధులు ఎలా సమకూర్చుకోవాలన్న ఆలోచనలలో పడి ఈ చంద్రగిరి పట్టణ రహదారి పనులు ఆలస్యం అవుతున్నాయి. స్థానికులు మాత్రం చంద్రగిరి శాసనసభ్యుడిగా ఎవరు ఎన్నికైనప్పటికీ తెగించి రహదారి విస్తరణ పనులకు పూనుకోకపోవటంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గతం వేరు ప్రస్తుతం వాహనాల రద్దీకి సరిపడా రోడ్డు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి పాదచారులు ఎలా వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితిని చవిచూస్తున్నారు. ఆదివారం వారపు సంత రోజుల్లో ఈ సమస్య చెప్పటానికి వర్ణనతీతం. చాలీచాలని సిబ్బందితో పోలీసులు తమ విధులు నిర్వహిస్తుండగా వారపు సంతరోజు గడియారం కూడలి వద్ద వాహన రాకపోకలను క్రమ బద్ధీకరించేందుకు సిబ్బందిని నియమించలేకపోతున్నారు. శాసనసభ్యులు పులివర్తి నాని సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉంటున్న ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టితే ఓ మైలురాయిలా నిలిచిపోతారని స్థానికుల అభిప్రాయం. ఎప్పటికి ఇది సహకారం అవుతుందో వేచి చూడాల్సిందే.

ఘనంగా సికెఏస్ తేజ దంతవైద్య కళాశాల స్నాతకోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: రేణిగుంట మార్గమధ్యంలో గల కృష్ణతేజ విద్యా సంస్థల్లో భాగమైన సికెఏస్ తేజ దంతవైద్య కళాశాల స్నాతకోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ - కమ్ వైస్ చాన్సలర్ మరియు ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డా. ఆర్.వి. కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి, సివిఎస్ తేజ ట్రస్ట్ సభ్యులు సుమలత, కవిత, వరుణ్ సాయి, సాహితి లతో కలిసి కార్యక్రమానికి అధ్యక్షత వహించి పట్టభద్రులైన విద్యార్థులను అభినందించారు. 2021-2022 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు. ముఖ్య అతిథి డా. ఆర్.వి. కుమార్ ను మరియు చైర్మన్ చదలవాడ కృష్ణ మూర్తిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. రవీంద్ర రెడ్డి వార్షిక అకాడమిక్ నివేదికను ప్రవేశపెట్టడంతో పాటు పట్టభద్రులైన విద్యార్థులతో వృత్తి నైతిక ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే వైస్ ప్రిన్సిపల్, వరల్డ్ పేథాలజీ విభాగాధిపతి డా. జి.శ్రీధర్ మరియు అధ్యాపక సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. ఆర్.వి. కుమార్ విద్యార్థులు నైతిక విలువలు, సేవాభావం మరియు వృత్తిపరమైన నిబద్ధతతో ముందుకు సాగాలని ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సివిఎస్ కృష్ణమూర్తి తేజ చారిటీస్ ట్రస్టీస్ సుమలత కవిత, వరుణ్ సాయి మరియు సాహితి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు స్నేహితులు మరియు పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు.

నేడే మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో టి.చంద్రమౌళి తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశానికి హాజరయ్యేటప్పుడు మండల శాఖ అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన పుంగనూరు మైనార్టీ నేతలు

విశాలాంధ్ర-పుంగనూరు: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ను పట్టణంలోని రాతి మసీదు కమిటీ గౌరవ అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్ సెక్రెటరీ సద్దాం హుస్సేన్ ఆదివారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం రాతి మసీదు భూములు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకోవడం వల్ల అన్యాక్రాంతం కావడం జరిగిందని సుమారు 300 నుంచి 350 ఎకరాల భూమి రాతి మసీదు కుంటే ప్రైవేట్ వ్యక్తుల కనుసన్నల్లో ఉన్నాయని వారు పేర్కొన్నారు. కాబట్టి చైర్మన్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి రాతి మసీదు భూములను కాపాడాలని కోరుతున్నామన్నారు దీనిపై స్పందించిన చైర్మన్ వెంటనే చర్యలు చేపట్టి రాతి మసీదు భూములు కాపాడి మసీదు అభివృద్ధికి అప్పజెప్పడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.

మద్యం సేవించి పోలీసులపై దురుసు ప్రవర్తన

ముగ్గురు ఆకతాయిలను అరెస్ట్ చేసిన ఎస్సై బి.రాఘవేంద్ర

విశాలాంధ్ర-పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో ముగ్గురు ఆకతాయిలు మద్యం సేవించి పోలీసుల పై దురుసుగా ప్రవర్తించినందుకుగాను వారిని అరెస్టు చేసామని ఎస్ఐ బి.రాఘవేంద్ర తెలిపారు. ఆయన వివరిస్తూ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు రాబడిన సమాచారం మేరకు స్థానిక పోలీసు వారు సిఎస్ఐ చర్చి కాంపౌండ్ వద్ద శేశంబేడు కాలనీకి చెందిన బి.విజయ్ (23), ఎం.ఇసాక్ (20) స్టాలిన్ (20) మీరు ముగ్గురు మద్యం సేవిస్తూ ఉండి దారిలో వచ్చి పోయే వారికి ఇబ్బంది కలిగిస్తున్నందున పిచ్చాటూరు పోలీసు వారు అక్కడికి వెళ్లి వారిని ప్రశ్నించి ఎక్కడినుండి తక్షణమే వెళ్ళిపోవాలని చెప్పగా వారు త్రాగిన మత్తులో ఉండి డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ చంద్రబాబు కానిస్టేబుల్ కవి అరసు పట్ల తురుసుగా ప్రవర్తించి బూతు మాటలు తిట్టి బెదిరించినందున వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వి.కోట: మండలంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ పర్యటించారు. ఈ సందర్భంగా పలువురిని పరామర్శించారు. మండల కేంద్రంలోని దుర్గా మాత ఆలయ ధర్మకర్త రఘుపతి నాయుడు స్వల్ప అనారోగ్యానికి గురికావడం తో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. అనంతరం సంత బండపల్లి గ్రామానికి చెందిన సచివాలయం మాజీ కన్వీనర్ మంజునాథ్ నాయుడు భార్య అనారోగ్యంతో ఉండటంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే పాముగానిపల్లి పంచాయతీ పాతూరు గ్రామంలో కన్వీనర్ సతీష్ రెడ్డి కుమార్తె వివాహ నిశ్చితార్థం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కర్నాటకలోని కే.జి.ఎఫ్ లో మండలంలోని కొంగాటం పంచాయతీ సర్పంచ్అనిత జయరాం రెడ్డి ల కుమార్తె వివాహ నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్, మండల ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ డా, తమీం ఖాన్, రాష్ట్ర కార్యదర్శి పి. ఎన్. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రచయితల సంఘం ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: 21న తిరుపతి జిల్లా రచయితల సంఘం ద్వితీయ వార్షికోత్సవంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో గౌరవాధ్యక్షులు గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా రచయితల సంఘం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించి 2026 27 టర్మ్ కు కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వేదిక, సమయం త్వరలో తెలియ చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ రచయితలు కార్యవర్గ సభ్యులు భూమన్, తోట వెంకటేశ్వర్లు, ఏనుగు అంకమ నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, మస్తానమ్మ, నాదెండ్ల శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, వాకా ప్రసాద్, జయరాం ప్రసాద్, రొద్దా సురేంద్ర, గాలి గుణశేఖర్, చెన్నకేశవులు నాయుడు, రమేష్, గోవిందయ్య, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి హెల్మెట్ తప్పనిసరి

రూరల్ ఎస్సై వెంకటేష్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: హెల్మెట్‌ధారణ సోమవారం నుంచి తప్పని సరి అని శ్రీకాళహస్తి రూరల్ ఎస్సై వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రజా రక్షణ కోసమే దీనిని తప్పనిసరిచేసినట్లు తెలిపారు. హెల్మెట్‌ధారణ ఒక బరువుగా భావించకుండా మీ కుటుంబం మీపై పెట్టుకున్న బాధ్యతగా ఆలోచించాలన్నారు. మీ తల్లిదండ్రుల బాధ్యత, భార్యబిడ్డల భవిష్యత్తు మీదేనని భావించాలన్నారు. నిర్లక్ష్యం వీడి బాధ్యతగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదం జరిగాక హెల్మెట్ పెట్టుకుని ఉంటే బాగుండేది అనే దాని కన్నా బాధ్యతలను గుర్తెరిగి హెల్మెట్ ధరించాలని తెలిపారు. ప్రతి పెట్రోల్ బంకు వద్ద హెల్మెట్ ధరించి ఉంటేనే పెట్రోల్ పడుతారన్నారు. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు కానున్నట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే మొదటి సారి రూ.వెయ్యి జరిమానా ఉంటుందన్నారు. మరోసారి పట్టుబడితే మరింత ఎక్కువగా జరిమానా, జైలుశిక్ష కూడా ఉంటుందని తెలిపారు. హెల్మెట్ ధారణ శిక్షగా భావించకుండా ప్రాణాలకు రక్షణగా అనుకుని ధరించాలన్నారు.

పద్మ సుగుణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యాచకులకు అన్నదానం

విశాలాంధ్ర-పుంగనూరు: పద్మ సుగుణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మధుబాల ప్రధాన కార్యదర్శి కృపాకర్ ఆధ్వర్యం లో పట్టణంలో ఉన్న యాచకులను చర్చ్ ఆవరణంలోకి పిలిచి అందరికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాట్లాడుతూ పట్టణంలో ఎంతో మంది యాచకులు ఒక పూట భోజనం దొరక్క తీవ్ర ఆందోళన చెందుతున్నారని మా ట్రస్ట్ దృష్టికి రావడం జరిగిందన్నారు అందులో భాగంగానే యాచకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వారు కడుపునిండా భోజనం పెట్టడం జరిగిందన్నారు అంతే కాకుండా ఈనెల 19వ తేదీన పంట పట్టణంలోని పేద మహిళలకు అనాథలకు చీరలు బెడ్ షీట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా మా ట్రస్టు ద్వారా సేవలు అందిస్తామని ఆయన తెలియజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తరపున చాగంటి చరణ్ బృందం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు ఆ సొమ్మును స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

21న పల్స్ పోలియో

విశాలాంధ్ర-దక్కిలి: ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 54 లక్షల మందికి పైగా పిల్లలకు పోలియో చుక్కలు వేసేం దుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంది. అధికారులు రాష్ట్రంలో 38,267 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలకు 61 లక్షల 26 వేల 120 పోలియో డ్రాప్స్ డోస్ లు పంపిణీ చేయడం జరిగింది. 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల్ని తప్పకుండా వేయించాలని అధికారుల సూచనలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యా సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం లో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హిందూ సమ్మేళనంలో భువన విద్యాలయ విద్యార్థులు

విశాలాంధ్ర- పీలేరు :హిందూ సమ్మేళనంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భువన విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షత్తు శ్రీవారు ప్రత్యేక్షమయ్యే విధంగాభువన విద్యాలయవిద్యార్థులుఅలరించారు.హిందూ సంప్రదాయం అంటే హిందూ మతంలోని ఆచారాలు, నమ్మకాలు, విభిన్న సంస్కృతులను ఇది ధర్మం, కర్మ, మోక్షం వంటి సిద్ధాంతాలపై భక్తి, పూజ,యజ్ఞం వంట అనేకఆచారాలనుకలిగిఉన్నటువంటి హిందూ సంప్రదాయాలు కండ్లకు ఉట్టి పడే విధంగా అలరించారు.హిందూ సంప్రదాయంలో అనేక దేవతలు విష్ణువు, శివుడు, శక్తి దుర్గా, పార్వతి, లక్ష్మి, సరస్వతి ముఖ్య వారన్నారని భువన విద్యార్థులు చూపించారు.

8 మంది జూదరుల అరెస్టు

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: ఎనిమిది మంది జూదుల అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3100 రూపాయలు తో పాటు ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పరమేష్ నాయక్ తెలిపాడు. మండలంలోని రాపూరి వాండ్లపల్లి చెరువు వద్ద కంపచెట్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడం తో సిబ్బందితో దాడి చేసి జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు.

నెహ్రూ పార్క్ అభివృద్ధి..ఆరోగ్యకరమైన వాతావరణం:మేయర్ పాక సురేష్ కుమార్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర వాసులకు ఉపశమనాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెహ్రూ పార్క్ ఉపయోగపడుతోందని కడప నగర మేయర్ పాక సురేష్ అభిప్రాయపడ్డారు. ఆదివారం కడప మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. మార్నింగ్ విజిట్లో భాగంగా పార్క్ పరిసరాలను, వాకింగ్ ట్రాక్, పచ్చదనం, మౌలిక సదుపాయాల పరిస్థితిని మేయర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్ నిత్యం వాకింగ్‌కు వచ్చే వారు, యోగా చేసే వారు మేయర్ ని కలిసి తమ సమస్యలను వివరించారు. పార్క్ లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని, మరింత అభివృద్ధి జరగాలని వారు కోరారు. ప్రజల అభిప్రాయాలను గమనించిన మేయర్, నెహ్రూ పార్క్ ను నగరానికి గర్వకారణంగా తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత మునిసిపల్ అధికారులను అక్కడికక్కడే పిలిపించిన మేయర్, ఇప్పటికే నెహ్రూ పార్క్ అభివృద్ధికి శాంక్షన్ పొందిన రూ.75 లక్షల నిధులతో వెంటనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. టెండర్ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా అవసరమైన చిన్నచిన్న అభివృద్ధి పనులు, పార్క్ పరిశుభ్రత, లైటింగ్, అలాగే త్రాగునీటి సదుపాయంను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా,

పార్క్ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకు వచ్చి బెంచీల ఏర్పాటు, సాంస్కృతిక విలువలు ప్రతిబింబించే విధంగా ఘంటసాల విగ్రహం ఏర్పాటు అంశాలపై చర్చించాలని మేయర్ సూచించారు. ఈ విషయంలో అక్కడ ఉన్న డాక్టర్లు, పట్టణ ప్రముఖులతో సంప్రదించి ముందడుగు వేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ధనలక్ష్మి,. డీఈ దిల్షాద్, ఏఈ. శ్రీకాంత్‌లు పాల్గొని, వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మార్నింగ్ విజిట్ బాలస్వామి రెడ్డి, పులి సునీల్ కుమార్, జయచంద్ర రెడ్డి, గుంటి నాగేంద్ర, మునిశేఖర్, ఫైజల్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం పట్టెం వాండ్లపల్లి పంచాయతీ గొల్లపల్లి కి చెందిన నరసింహులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తను ఉంటున్న ఇంటిలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు బియ్యం, బట్టలు మొదలైనవి అగ్నికి దగ్ధమయ్యాయి.లక్ష ఆస్తి నష్టం వచ్చినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

గండబోయినపల్లి టోల్ ప్లాజా భారీ టోల్ వసూళ్లపై మిథున్ రెడ్డి ఫిర్యాదు

విశాలాంధ్ర- గుర్రంకొండ :గండబోయినపల్లి టోల్ ప్లాజా భారీ టోల్ వసూళ్ల పై నేషనల్ హైవే అథారిటీ కి రాజంపేట పార్లమెంట్ సభ్యులు వెంకట మిథున్ రెడ్డి న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యదర్శికి నెల 7వ తేదీన లేఖ రాసినట్లు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీఎస్ ఆఘా మోహియుద్దీన్ శనివారం సాయంత్రం 5గంటలకు తెలిపారు. ఈ లేఖలో ఎంపి వెంకట మిథున్ రెడ్డి ప్రస్తావిస్తూ..రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అన్నమయ్య జిల్లా కలికిరి సమీపంలో గత ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన గండబోయినపల్లి టోల్ ప్లాజా వద్ద స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఆదేశాలు జారీ చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి కి ఎంపీ వెంకట మిథున్ రెడ్డికి లేఖలో పేర్కొన్నారు. గండబోయినపల్లి టోల్ ప్లాజా సమస్యల పై కి ఈ నెల 7న లేఖ రాసి పరిష్కరించాలని కోరిన ఎంపీ వెంకట మిథున్ రెడ్డి కి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీఎస్ ఆఘా మోహియుద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మనసు ప్రశాంతతకు ధ్యానం ఎంతో అవసరం

విశాలాంధ్ర- మదనపల్లె :మనసు ప్రశాంతతకు, ఆరోగ్యానికి, ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం ఎంతో అవసరమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ క్రాంతి తెలిపారు. ఆదివారం స్థానిక కన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురుదేవ్ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో మెడిటేషన్ కార్యక్రమం చాలా ముఖ్యమైందని తెలిపారు. ఇందులో చేపట్టే సుదర్శన క్రియ మనిషి జీవితంలో ఎంతో మార్పు తీసుకొస్తోందని, మానసిక ఒత్తిడి ని అధిగమించి ప్రశాంతకరమైన జీవితం గడిపేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఈ నెల 21న ప్రపంచ మెడిటేషన్ డే సందర్భంగా గురుదేవ్ రవిశంకర్ యునైటెడ్ కింగ్డమ్ నుంచి మెడిటేషన్ లో పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో 180 దేశాల నుంచి సుమారు 800 కోట్ల మంది వర్చువల్ విధానంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కావున ప్రతిఒక్కరూ 21 వ తేది రాత్రి 8:30 గంటలకు యూట్యూబ్ లో గురుదేవ్ రవిశంకర్ ఛానల్ కు లాగిన్ అయ్యి లోకంతో పాటు మనమూ ధ్యానంలో మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మదనపల్లె ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ అపెక్స్ మెంబర్ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు మోడల్ క్వశ్చన్ పేపర్స్ పంపిణీ

విశాలాంధ్ర- గుర్రంకొండ :స్థానిక బాలికల గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మోడల్ క్వశ్చన్ పేపర్స్ పంపిణీ చేశారు.రిడో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు త్రినాథ్ మాట్లాడుతూ పదవ తరగతి యొక్క ప్రాముఖ్యత పదవ తరగతిలో తీసుకోవలసినటువంటి జాగ్రత్తలు చదువుపై శ్రద్ధ ,ఏకాగ్రత, తపన మరియు అంకితభావం మీరు అనుకున్న స్థాయికి చేరుస్తాయి అని విద్యార్థులకు సూచనలు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తు కోరి వారిపై అభిమానంతో రెడో సేవా సంస్థ వారు 47 మంది విద్యార్థులకు మొత్తం 329 పుస్తకాలు ఇవ్వడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ మోడల్ క్వశ్చన్ పేపర్స్ పిల్లలకు చాలా ఉపయోగపడతాయి అన్నారు.. అలాగే విద్యార్థులకు మోటివేషన్ క్లాసెస్ కూడా నిర్వహణ చేయవలెనని రిడో సేవా సంస్థ వారిని విజ్ఞప్తి చేశారు. అనంతరం రిడో స్వచ్ఛంద సేవా సంస్థ

ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి పేరు తెచ్చుకోవాలని, అలా మంచి పేరు తెచ్చుకోవాలంటే దురల వాట్లకు మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మీరు మంచిగా ఉండటం వలన మీకు మంచి పేరు రావడంతో పాటు మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మీ గ్రామానికి కూడా మంచి పేరు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి విద్యార్థులందరూ మంచిగా ఉండడం మంచి ఆలోచించడం మంచి చెప్పడం మంచి వినడం మంచిగా పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పేతురులు పాల్గొన్నారు.

బేపారి జాకీర్ అహమ్మద్ కుమార్తె నిఖా వేడుకలో ప్రముఖులు

విశాలాంధ్ర-పొద్దుటూరు: స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని బి.ఎం.ఎం ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు బేపారి జాకీర్ అహమ్మద్ కుమార్తె నిఖా వేడుకలలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఉర్దూ అకాడమీ ఛైర్మెన్ ఫారూఖ్ శిబ్లి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



పీలేరు రెవెన్యూ డివిజన్ ఏపీ సర్వేయర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా రమేష్ బాబు

విశాలాంధ్ర- పీలేరు : ఆంధ్రప్రదేశ్ సర్వేయర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన పీలేరు రెవిన్యూ డివిజన్ సర్వేయర్స్ కు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నందు పీలేరు మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, సంబేపల్లి మండల సర్వేయర్ హరికృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎన్నికల నిర్వహణాధికారిగా మదనపల్లి డివిజన్ మాజీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి నాయుడు ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరించారు. నూతన పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీలేరు, కె.వి పల్లి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, సదుం, సోమల మండలాలలో పనిచేసే సర్వే యర్స్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది పీలేరు రెవెన్యూ డివిజన్ అధ్యక్షులుగా సి రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా, ఎస్ హర్షద్ అయూబ్

ఖాన్, సెక్రటరీ గా జి. శరత్ కుమార్, జాయింట్ సెక్రటరీ గా సి. అన్న పూర్ణ, కోశాధికారిగా బి.విజయ్ కుమార్ నాయక్ , కార్యవర్గం సభ్యులుగా జి మీనా, ఎం మనోజ్ కుమార్, ఎస్ పవన్, పి పవన్ కుమార్, బి అనిల్ కుమార్ రెడ్డి, కే గోపి లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎంప్లాయిస్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉద్యోగస్తుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

బాలపల్లి అడవుల్లో ప్రవేశించిన ఇద్దరు అరెస్టు

గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం

విశాలాంధ్ర -తిరుపతి: అన్నమయ్య జిల్లా బాలపల్లి అడవుల్లో ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులను శనివారం రాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లీభాషా టీమ్ స్థానిక ఎఫ్బీఓ సాయికృష్ణతో కలసి బాలపల్లి అటవీ రేంజ్ లోని కాంగిమడుగు ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. వీరు మోతుమంగల వద్దకు చేరుకున్నారు. అక్కడ కొంతమంది వ్యక్తులు ఒకరి వెంట ఒకరు వెళుతూ కనిపించారు. వారిని సమీపించి చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారు పారిపోసాగారు. అయితే వారిలో ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని తమిళనాడు జమునామత్తూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా సీఐ ఎస్. ఖాదర్ బాషా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో చిట్టమూరు బీజేపి నేతలు

విశాలాంధ్ర-చిట్టమూరు: భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ - మోదీ సుపరిపాలన యాత్ర, ఆదివారం రేణిగుంట, జాతీయ రహదారి నుంచి ప్రారంభమయ్యింది. తిరుపతిలో ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ చిట్టమూరు మండల అధ్యక్షులు దువ్వూరు శరత్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో సుపరిపాలనకు వాజ్ పేయి నాంది పలికారని, ఆయన తీసువచ్చిన విధానాలు, దేశ అభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తు చేశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్ పేయి స్వశక్తితో ఎదిగి దేశానికి నాయకత్వం వహించా రన్నారు. ఆయన బాటలోనే ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశాన్ని 2047 నాటికి నెంబర్ వన్ గా చేసేందుకు పనిచేస్తున్నారన్నారు.

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా గురవారెడ్డి నియామకం పట్ల హర్షం: గాలి మురళి నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆశీస్సులతో పదవి పొందడం హర్షణీయమని మురళి నాయుడు వ్యక్తం చేశారు. మురళి నాయుడు మాట్లాడుతూ ఎంతోమంది పార్టీలో ఉండి పార్టీని ఉపయోగించుకొని పార్టీ మారిన వారిని చూడడం జరిగింది. కానీ పార్టీ కోసం నిరంతరం సేవ చేస్తున్న గురవారెడ్డి సేవలను గుర్తించి పదవిని ఇవ్వటం కార్యకర్తల పట్ల పార్టీకి ఉన్న గుర్తింపు అభినందించతగినదని కొనియాడారు. తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, సంద్ర మహేష్ నాయుడు, బింగి సుబ్బు, బొర్షర గిరి,మెరిమి మణి, బింగి పాల్గుణ, భింగివంశీ, వెంకటేష్, పల్లిపాటి పరశురాం,చంద్ర, రాపూరు దశరథ, శనగ వెంకటరమణయ్య తదితరులు ఏపీ సీడ్స్ సర్కిల్ వద్ద గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు.

ఏకగ్రీవంగా తెదేపా మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీ

విశాలాంధ్ర-కుప్పం: నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పీకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు చొరవతో, కడ అడ్వైజర్ రాజ్ కుమార్, షాది మహల్ చైర్మన్ సర్దార్ భాష, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ మున్సిపల్ జనరల్ సెక్రెటరీ నబి ఆధ్వర్యంలో మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అని నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ తెలిపారు. తెదేపా మున్సిపల్ మైనారిటీ నూతన అధ్యక్షుడిగా ఉమర్ ఖాన్ని, ఉపాధ్యక్షులుగా జావిద, ఇస్మాయిల్, జనరల్ సెక్రెటరీ మహబూబ్ బాషా, ఆర్గనైజర్ సెక్రెటరీగా మక్బూల్ బాషా, ఇస్మాయిల్ సమీర్, సెక్రటరీలుగా జహీర్ అహ్మద్, సలీం జావిద్, సయ్యద్ ఫయాజ్ లను ఏకగ్రీవం గా ఎన్నుకోవడం జరిగింది అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారికి దుస్సాలువతో సన్మానం చేసి శుభకాంక్షలు తెలిపారు.

గంగ తిమ్మనపల్లి కి రోడ్డు వసతి కల్పించండి

విశాలాంధ్ర-శాంతిపురం: శాంతిపురం మండలం మఠం పంచాయతీ గంగా తిమ్మనపల్లి గ్రామస్తులు రోడ్డు తమ ఊరికి కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. కుప్పం పలమనేరు జాతీయ రహదారి నుంచి ఎం శాంతంపల్లి,గంగ తిమ్మన పల్లె గ్రామాలలో కలుపుకొని దండి కుప్పం వరకు రోడ్డు ఉందన్నారు. ఇది రెవెన్యూ వారి లెక్కలలో కూడా ఉందని, గతంలో తారు రోడ్డు కూడా వేశారని, ఆ సమయంలో గంగ తిమ్మన పల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తారు రోడ్డు తమ ఊరికి రాకుండా అడ్డుకున్నాడని, రోడ్డు ఆ రైతు ఇంటి వరకే వస్తుందని, ఊర్లోకి రాదని, తమ ఊరిలోకి అంబులెన్సులు రావాలన్నా, స్కూలు బస్సులు రావాలన్నా, ఎరువులు తెచ్చుకోవాలన్న, ట్రాక్టర్లు రావాలన్నా, రోడ్డు సౌకర్యం లేదని, దాని వలన గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాల నుండి ఆ రైతు ఊర్లోకి రోడ్డు రాకుండా చేస్తున్నాడని, ఇప్పుడు గవర్నమెంట్ వారు 15 లక్షలు ఖర్చుపెట్టి ఆ రైతు ఇంటి వద్ద వరకు మాత్రమే సిసి రోడ్డును ఏర్పాటు చేస్తున్నారని, అదే రోడ్డు ఊర్లోకి కూడా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు రాతపూర్వకంగా ఎమ్మార్వోకి వినతి పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

పాఠకులకు ఉపయోగకరంగా గ్రంథాలయాలు

జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాఠకులకు ఉపయోగకరంగా గ్రంథాలయ వ్యవస్థను తీర్చిదిద్దుతానని జిల్లా గ్రంథాలయ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన శ్రీకాళహస్తికి విచ్చేశారు. ఏపీసీడ్స్ కూడలి వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగాస్వాగతం పలికారు. ఆయన కేక్ కట్‌చేసి నాయకులు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం ఆర్టీసీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో మండల జిల్లా రాష్ట్ర స్థాయిలో యువత కమిటీలు అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా అధికార ప్రతినిధిగా తంబళ్లపల్లి నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా మైదుకూరు పార్టీ పరిశీలకుడిగా యువ గళం యాత్రలో పలు నియోజకవర్గాల్లో పరిశీల కుడిగా పనిచేయడం జరిగిందని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో తనను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీరెడ్డి తదితర ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో గ్రంథాలయ సంస్థను ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. సీఎం నారాచంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థను తీసుకురావాలని సంకల్పంతో వారి ఆలోచన మేరకు గట్టిగా పనిచేసి ప్రజలకు పాఠకులకు ఉపయోగకరంగా గ్రంథాలయాలు తీర్చిదిద్దుతామని గురవారెడ్డి అన్నారు. తనకు స్వాగతం పలికిన టీడీపీ నాయకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, సీనియర్ నాయకులు తొట్టంబేడు మాజీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు,నాయకులు పేట బాలాజీ రెడ్డి, నాగేశ్వరరావు, కందాటి మహేష్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రాఘవల యాదవ్, దొరై రాజు రెడ్డి, మునయ్య, మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొనానరు.

బేడి ఆంజనేయస్వామివారికి ప్రత్యేక అభిషేకం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసి వున్న శ్రీ బేడి ఆంజనేయ స్వామివారికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ.శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ దా. మధు సూదన్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్‌ను ఆవిష్కరించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

డిసెంబర్ 12 నుండి జనవరి 18, 2026 వరకు 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' ప్రత్యేక ప్రదర్శన

విశాలాంధ్ర-తిరుపతి: భారతదేశంలోని విభిన్న వివాహ సంప్రదాయాలు, సంస్కృతి, భావోద్వేగాలను ప్రతిబింబించే 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్ ప్రచారాన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూంలో కస్టమర్ల చేత ఘనంగా ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అగ్రగామి బంగారు, వజ్రాభరణాల రిటైల్ సంస్థలలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, భారతీయ వధువుల సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రతి వధువు తన పెళ్లి రోజున ధరించే ఆభరణాలు ఆమె భావోద్వేగాలు, సంస్కృతి, కుటుంబ వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్న సంస్థ ప్రతినిధులు, స్వచ్ఛత, నైపుణ్యం, నమ్మకంతో రూపొందించిన ప్రత్యేక వివాహాభరణాలను అందిస్తున్నట్లు తెలిపారు. 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్‌లో దేశవ్యాప్తంగా 22 మంది వధువులు, 10 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో ఎన్టీఆర్, కార్తి, ఆలియా భట్, కరీనా కపూర్ ఖాన్, అనిల్ కపూర్ వంటి ప్రముఖ నటులతో పాటు శ్రీనిధి శెట్టి, రుక్మిణి మైత్ర, సబ్యసాచి మిశ్రా, ప్రార్ధన బెహేరే, మనసి పారేఖ్ పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూంలో డిసెంబర్ 12, 2025 నుంచి జనవరి 18, 2026 వరకు 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. బంగారం, వజ్రాలు, రత్నాలతో రూపొందించిన ఆకర్షణీయమైన వివాహాభరణాల కలెక్షన్లు ఇందులో అందుబాటులో ఉంటాయి. ఈ ప్రదర్శన సందర్భంగా కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించారు. అన్ని బంగారం, అన్కట్ మరియు రత్నాల ఆభరణాల తయారీ చార్జీలపై 30 శాతం వరకు, వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు ఆఫర్లు జనవరి 18, 2026 వరకు చెల్లుబాటు అవుతాయని తెలిపారు.

ఉత్తరాఖాండ్ సీఎంకు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: వాజపేయ్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విగ్రహావిష్కరణకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికిచేరుకుని ఉత్తరాఖాండ్ సీఎం పుష్కరసింగ్ థామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకు మార్కు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనం ద్ ఘనస్వాగతం పలికి కలంకారీ వస్త్రాలతో సత్కరించారు. వారికి ముక్కంటి ప్రసా దాలను అందజేశారు. ఈకార్యక్ర మంలోబీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని సేవలో తిరుపతి శాసనసభ్యులు

విశాలాంధ్ర - కాణిపాకం : కాణిపాక స్వామివారిని దర్శించుకున్న తిరుపతి శాసన సభ్యులు. శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్న తిరుపతి నియోజ కవర్గ శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకు న్నారు, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, ఆలయ మాజీ బోర్డు సభ్యులు పూల ప్రభాకర్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతిభ పోటీల్లో చిత్తూరు విద్యార్థికి బహుమతి

విశాలాంధ్ర -చిత్తూరు: తెలుగు ప్రతిభ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన చిత్తూరు విద్యార్థి నసీం భాను జిల్లాస్థాయిలో మొదటి బహుమతిని సాధించింది. తిరుపతి జాతీయ సంస్కృతిక విద్యాలయంలో తెలుగు హిందీ భాష ప్రతిభ పోటీలను నిర్వ హించారు. ఇందులో తెలుగు విభాగంలో చిత్తూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నసీం భాను ప్రథమ బహుమతిని సాధించింది. సంస్కృత విశ్వవిద్యాల యం ఉపకులపతి జివిన్ కృష్ణమూర్తి ద్వారా ఈ విద్యార్థి ప్రశంస పత్రం జ్ఞాపకను నగదు పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు కొత్తపల్లి పాపయ్యను వి సి ప్రత్యేకంగా సన్మానించారు.

జాతీయస్థాయి కరాటే కుంగ్ ఫ్యూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కోట: కోట మండలం విద్యానగర్ కు చెందిన విద్యార్థులు పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కుంగ్ఫూ కరాటే పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు గూడూరు డివిజన్ కు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు హాజరై తమ తమ ప్రతిభ కనపరిచి షీల్డు మొమెంటులు అందుకున్నారు. కోట మండలం విద్యానగర్ విద్యా వికాస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఈకరాటే పోటీలలో పాల్గొనగా ఐదవ తరగతి చదువుతున్న ముప్పవరపు.వెంకట లాస్య అక్షర కరాటేలు కటా విభాగంలో జాతీయస్థాయిలో ప్రథమ,ద్వితీయ బహుమతులను అందుకుంది అలాగే మిగిలిన విద్యార్థినీ విద్యా ర్థులు తృతీయ కన్సోలేషన్ బహుమతులు సాధించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా జాతీయస్థాయిలో నిర్వహించే ఈపోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలనుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటారు. అనంతరం బహుమతులు అందుకున్న విద్యార్థిని విద్యార్థులను శ్రీ విద్యా వికాస్ సొసైటీ వైస్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కరాటే మాస్టర్ హరి, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

శ్రీవారి దివ్య ప్రసాదములు పుస్తకాన్ని ఆవిష్కరించిన టీటీడీ చైర్మన్

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు రచించిన "శ్రీవారి దివ్య ప్రసాదములు" పుస్తకాన్ని ఆదివారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాల యంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో శ్రీవారికి వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే కైంకర్యాల్లో నివేదించే అన్న ప్రసాదాలు గురించి పూర్తి సమాచారాన్ని పుస్తకంలో పొందు పరిచినట్లు చైర్మన్ కు పుస్తక రచయిత రమణ దీక్షితులు తెలియజేశారు.

శిల్పారామంలో అలరించిన నాట్య ప్రదర్శనలు

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శిల్పారామంలో నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 14వ తేది ఆదివారం సాయంత్రం శ్రీ పద్మ కళాక్షేత్రం డాన్స్ అకాడమీ తిరుచానూరు ఆధ్వర్యంలో భరతనాట్య నృత్య ప్రదర్శనలు నిర్వహిం చారు. శ్రీదేవి బాలాజీ శిష్యులు ప్రదర్శించిన నాట్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు మహా గణపతి ప్రార్థన గీతం, శివతాండవం, భజరే నందగోపాలా, బృందావనకి రారా కృష్ణ, అరుణాచలేశ్వర శివ నాట్యం, పుష్పాంజలి, జానపద గీతాలు, సమాజవరగమన, శ్రీనివాస కళ్యాణం, మహాలక్ష్మి కౌత్ వంటి అంశాలతో నృత్యాలు ప్రదర్శించారు. ఈ నృత్య ప్రదర్శ నల్లో స్వప్న, కె.దర్శిక, కె.రోహిణి, ఎల్.ప్రణవ్య, పి.కుశ్రీ, వెనీషా, లెనిషా, శ్రావణి, గీతాంజలి, కె.లితీక్ష, దివ్యశ్రీ, అన్విత, ఎన్.అద్వైత, ధానుశ్రీ, తేజ, ఎన్.పల్లవి, పి.హేమశ్రీ, పి.సోనీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు శిల్పారామం పరిపాలన అధికారి (ఏవో) బి.సుధాకర్ మరియు ఏఈ. రాధాకృష్ణ ప్రశంస పత్రాలు అందజేశారు.

నారా బ్రహ్మాణికి మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు

విశాలాంధ్ర - చంద్రగిరి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు మన మరాలు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోడలు మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మిణికి మోస్ట్ పవర్ ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు అందుకుంది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కా రాన్ని భువనేశ్వరి స్వీకరించింది. భారత్‌లో మహిళా నేతలను ప్రోత్సహించ దంపై బిజినెస్ టుడేకు ప్రశంసలు అందుకొంది. హెరి టేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బ్రహ్మణి బాధ్యతలు నిర్వహిస్తున్నది. ఏపీ మంత్రి నారా లోకేశ్ సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి ప్రతిష్ఠాత్మక పురస్కా రాన్ని అందుకున్నారు. ప్రముఖ వాణిజ్య మ్యా గజైన్ బిజినెస్ టుడే ఏటా అందించే మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. ముంబైలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మణి ఈ అవార్డును స్వీక రించారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడిస్తూ, ఈ గుర్తింపు దక్కడం పట్ల గౌరవం గా భావిస్తున్నట్లు తెలి పారు. ఈ సందర్భంగా నాయకత్వంపై తన అభిప్రా యాన్ని పంచుకు న్నారు. నాయకత్వం అంటే శాశ్వతంగా నిలిచే సంస్థలను నిర్మిం చడం, బాధ్యతాయుతంగా విలువను సృష్టించడం, ఈ క్రమంలో ప్రజల ను శక్తివంతం చేయ డమే అని ఆమె పేర్కొ న్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు బిజినెస్ టుడేకు ఆమె ధన్యవాదాలు తెలి పారు. భారతదేశవ్యాప్తంగా మహిళా నేతలను ప్రోత్సహించడం అభినం దనీయమని కొనియాడారు. ఎన్ఎస్ఈ ఇండి యాలో తన అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉందని చెప్పారు. నారా బ్రాహ్మణి ప్రస్తుతం హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తి స్తున్నారు. దీంతో పాటు, తన తండ్రి నంద మూరి బాలకృష్ణ చైర్మన్‌గా ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్టులో బోర్డు మెంబర్‌గా కూడా సేవలందిస్తున్నారు. ఇది ఎలా ఉండగా తమ హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవర్ ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు అందుకో వటం తమకెంతో ఆనందంగా ఉందని ఆమెకు అభినందనలు తెలుపుతూ సిబ్బంది చంద్రగిరి కాశిపెంట్ల వద్ద గల హెరిటేజ్ డైరీలో సంబరాలు చేసుకున్నారు.